# భగవంతుడు

ప్రహరాజు రాధాకృష్ణ

ఊరికి దూరంగా పచ్చని మామిడితోట నడిమధ్య అందంగా, ఆకర్షణీయంగా కట్టబడి ఉందా బంగ్లా.

ఊర్లో పెద్దమనిషి, పేరున్న మనిషి అయిన శివయ్యగారు తన అభిరుచికి తగినట్లుగా అన్ని సౌకర్యాలతో అధునాతనంగా కట్టించుకున్న విశ్రాంతి బంగ్లా అది.

ఒక రోజు- ఆ విశ్రాంతి బంగ్లాలో- ఓ గదిలో కూర్చొని- శివయ్యగారు, ఆయన మిత్రులు అనంతంగారూ కాలక్షేపం కబుర్లలోపడ్డారు.

శివయ్యగారికి అవకాశం దొరికినప్పుడల్లా మిత్రుడ్నో, బంధువునో వెంటబెట్టుకుని ఆ బంగ్లాకి రావడం ఆ గదిలో కూర్చుని కాలక్షేపం కబుర్లలో పడడం అలవాటు!

ఇరవై నాలుగు గంటలూ అక్కడే ఉండి ఆ తోటని, ఆ బంగ్లానూ కనిపెట్టుకుని మసలే వాచ్‌మెన్ బైరాగికి కూడా తన యజమాని ఆ కాలక్షేప కబుర్లఘట్టం సదా మామూలే!

ఆ కాలక్షేప కబుర్లఘట్టంలో అగ్గిపెట్టినుండి అణుబాంబు వరకూ, రాజకీయాలనుండి రాకెట్టు ప్రయోగాల వరకూ దొర్లని విషయం అంటూ ఉండదు.

శివయ్యగారు ఆ బంగ్లాకు వచ్చి ఆ గదిలో కూర్చున్న మరుక్షణం నుండి ఆయన పిలవగానే పలికేందుకన్నట్లు ఆ గది బైట వరండాలో సిద్ధంగా కూర్చొని ఉంటాడు వాచ్‌మెన్ బైరాగి.

> **"అదేమంత గొప్ప విషయం కాదు బాబూ! మీకూ, ఇక్కడున్న ప్రతి వస్తువుకూ నేను వాచ్‌మెన్‌ని. ఇక్కడ దేనికి నష్టం రాకుండా, కష్టం కలుగకుండా చూడవలసిన బాధ్యత నామీద వుంది. అంతేకాదు, మీ ప్రాణాలమీదకు నా కళ్ళముందే ప్రమాదం ముంచుకొస్తున్నప్పుడు సాటి మనిషిగా నా ప్రాణాలు పణం పెట్టయినా మీ ప్రాణాలు కాపాడాలి. అది మానవత్వం వున్న మనిషిగా నా ధర్మం కూడా బాబూ! ఆ ధర్మాన్ని పాటించడంవల్లే నేను మీ దృష్టిలో భగవంతుడిలా కన్పిస్తే... మరెందుకు బాబూ! మీ మధ్య ఆ భగవంతుడు ఉన్నాడా లేడా అనే వాదాలు?"**

ఆరోజు శివయ్యగారికి, అనంతంగారికి మధ్య జరుగుతున్న కాలక్షేప కబుర్లఘట్టం ఎక్కడ మొదలై, ఇంకెక్కడ మలుపు తిరిగిందోగాని చిట్టచివరకు భగవంతుడు ఉన్నాడా?! లేడా?! అనే విషయం దగ్గర వేడి పుంజుకుంది.

శివయ్యగారు గొప్ప ఆస్తికులు. ఆయనకి భగవంతునిపట్ల అపారమైన భక్తి విశ్వాసాలు ఉన్నాయి.

అనంతంగారు పరమ నాస్తికులు. అసలు భగవంతుడనేవాడే లేడనే వ్యక్తి!

ఆ ఇద్దరి మధ్యా మాటలు నెగళ్ళు చిమ్ముతున్నాయి!

రకరకాల ఉదాహరణలతో, నమ్మకాలతో వాదప్రతివాదాలు మొదలయ్యాయి!

''ఆ భగవంతుని కరుణా కటాక్షాలే లేకపోతే ఇక్కడ నువ్వూ, నేనే కాదు, చివరికి సూక్ష్మమైన పరమాణువు కూడా మనలేదు. ఈ సృష్టిలో ప్రతిచలనం ఆ భగవంతుని ఆజ్ఞా...'' అంటూ శివయ్యగారు నాస్తికుడైన అనంతంగార్కి కాస్త చురక అంటించారు.

''అదంతా మన భ్రమ! అలాంటి భ్రమల్ని ఆసరా చేసుకునే యుగయుగాలుగా తరతరాలుగా కొంతమంది బడా మోసగాళ్ళు బాబాలుగా, స్వాములుగా, భగవత్ స్వరూపులుగా అవతారాలెత్తి అమాయకపు ప్రజల్ని నిలువునా దోచుకుతింటున్నారు...'' అంటూ శివయ్యగారి మాటలకు అనంతంగారు బదులుచెప్పేరు.

గదిలో ఆ ఇద్దరిమధ్యా జరుగుతున్న ఆ వాదసంవాదాలు తనకేమీ పట్టనట్లు బైట వరండాలో కూర్చొని ఉన్నాడు బైరాగి!

శివయ్యగారికి, అనంతంగారికి మ...
సంవాదాలు అలా ఎంతసేపు జరిగేయో తె...

కానీ- ఒక్కసారి- హఠాత్తుగా- ఇద్దరి...
మౌనం దాల్చేయి!

ఒకటి- రెండూ.. నిమిషాలు గడుస్తున్నాయి!

ఇద్దరిమధ్యా అదే మౌనం!

ఇద్దరూ ఒకేసారి ఎందుకు మౌనం వహించారు?

గది బైట వరండాలో కూర్చున్న బైరాగికి అంతు...
క్కలేదు!

ఆశ్చర్యంతో అతడి కనుబొమలు ముడిపడ్డాయి!

వృత్తిధర్మం అతడి వెన్నుతట్టింది. లేచి నిలుచున్నాడు. చేతిలోవున్న లాఠీకర్ర వరండాలో గచ్చుకు తగిలి చిన్నశబ్దం అయింది. లాఠీకర్రను ఊపుకుంటూ వెళ్ళి వరండాదాటి గదిబైట ద్వారం దగ్గర నిల్చుని లోపలికి చూసేడు.

అంతే!

అక్కడ దృశ్యం చూసి నిర్ఘాంతపోయాడు!

శివయ్యగారూ, అనంతంగారూ కూర్చున్న కుర్చీలకు ఎదురుగా ఉన్న బల్లపై నల్లని పొడవైన, బలమైన త్రాచుపాము..!

బుస్.. బుస్.. అంటూ బుసలుకొడుతూ పడగెత్తి ఆ ఇద్దరివైపు చూస్తూ నాలికాడిస్తున్నది.

ఆ ఇద్దరూ త్రాచుపామువైపు చూస్తూ, నిలువుగుడ్లేసుకుని స్థాణువుల్లా కుర్చీలో బిగుసుకుపోయి కూర్చున్నారు.

ఇద్దర్లో ఎవరు కదిలినా ఆ పాము కాటువెయ్యక మానదు.

ఇద్దరూ ఊపిరి తియ్యడం కూడా మరచినట్లుంది!

ఇరువురిలోనూ ఒకేరకమైన సంకటస్థితి, చావు భయం!

బైరాగి ఆ దృశ్యం చూసి ఒక్కక్షణం నిశ్చలుడై, మరుక్షణం తేరుకున్నాడు!

ఆలోచన తట్టింది- కర్తవ్యం గుర్తొచ్చింది...


శబ్దం చెయ్యకుండా చేతిలోవున్న లాఠీకర్రను రెండు చేతులతో గట్టిగా పట్టుకుని మెల్లగా నడుచుకుంటూ ద్వారం దాటి గది లోపలికి నాలుగు అడుగులు వేశాడు. బల్లకు దగ్గరగా వెళ్ళాడు. బల్ల చివర్ని చేతిలో లాఠీతో సన్నగా తట్టేడు.

త్రాచుపాము మెరుపువేగంతో తన పడగను ఆవైపు తిప్పింది. అక్కడున్న బైరాగిని చూడగానే ఒక్కసారిగా పడగ విసిరి అతడ్ని కాటు వేయడానికి ఉరికింది. కానీ- దాని కదలికను ముందే ఊహించి ఎదురుదాడికి సిద్ధంగా ఉన్న బైరాగి రెప్పపాటుకాలం కూడా ఆలస్యం చెయ్యకుండా చేతిలో ఉన్న లాఠీకర్రతో సరిగ్గా ఆ త్రాచుపాము పడగమీద విసురుగా ఒక్క దెబ్బ కొట్టేడు.

బలమైన ఆ దెబ్బకు త్రాచుపాము అమాంతం గాల్లోకి ఎగిరి గింగిర్లు తిరుగుతూ వెళ్ళి గోడకు గుద్దుకుంది. కాసేపు పడినచోటే మెలికలు తి...

గుతూ చుట్టుకుంది. మరికాసేపటికి చలనరహితమైంది.

బైరాగి మెల్లగా వెళ్ళి చేతిలోవున్న లాఠీకర్రతో త్రాచుపామును కదిపి చూశాడు. చచ్చిందని నిర్ధారణ చేసుకున్నాడు. చచ్చిన పామును బైట పారవేసేందుకు లాఠీకర్రతో దాన్ని ఎత్తిపట్టుకున్నాడు.



ఆ దృశ్యమంతా శివయ్యగారూ, అనంతం గారూ నిర్ఘాంతపోయి చూస్తున్నారు!

అలా తనవైపు నిర్ఘాంతపోయి చూస్తున్న వార్ని ఉద్దేశించి ''చచ్చింది బాబూ!... మరేం ఫర్వాలేదు..'' అంటూ బైరాగి గది ద్వారంవైపు కదిలేడు.

అంతవరకూ చావు భయంతో స్థాణువులై ఉండిపోయిన ఆ ఇద్దరూ బైరాగి అన్న మాటలకు కాస్త తెప్పరిల్లేరు.

ఇంకా వారి కళ్ళముందు అదే దృశ్యం!

బైరాగి చూపిన సమయస్ఫూర్తి, సాహసం వారిరువురి మనసుల్ని కదిలించింది. అతడిపట్ల కృతజ్ఞత వార్ని కుదిపింది.

''వెరీగుడ్ వాచ్‌మెన్! నువ్వు నిజంగా గొప్ప మనిషివి. మహోన్నతుడివి'' అన్నారు అనంతం గారు నిష్కల్మషమైన మనస్సుతో.

''చాలా రిస్క్ తీసుకుని మమల్ని కాపాడేవు. ఈరోజు మా పాలిట నిజంగా నువ్వు భగవంతుడవే!'' అన్నారు శివయ్య గారు వినమ్రత నిండిన గొంతుతో.

చచ్చిన త్రాచుపామును గది బైటకు తీసుకుని వెళ్లిపోతున్న బైరాగి ఆ మాటలకు ద్వారం దగ్గర ఆగాడు.

''అదేమంత గొప్ప విషయం కాదు బాబూ! మీకూ, ఇక్కడున్న ప్రతి వస్తువుకూ నేను వాచ్‌మెన్‌ని. ఇక్కడ దేనికి నష్టం రాకుండా, కష్టం కలుగకుండా చూడవలసిన బాధ్యత నామీద వుంది. అంతేకాదు, మీ ప్రాణాలమీదకు నా కళ్ళముందే ప్రమాదం ముంచుకొస్తున్నప్పుడు సాటి మనిషిగా నా ప్రాణాలు పణం పెట్టయినా మీ ప్రాణాలు కాపాడాలి. అది మానవత్వం వున్న మనిషిగా నా ధర్మం కూడా బాబూ!

ఆ ధర్మాన్ని పాటించడంవల్లే నేను మీ దృష్టిలో భగవంతుడిలా కన్పిస్తే... మరెందుకు బాబూ! మీ మధ్య ఆ భగవంతుడు ఉన్నాడా లేడా అనే వాదాలు?'' అంటూ సన్నసన్నగా నవ్వుతూ ముందుకు కదిలాడు.

బైరాగి అన్న మాటలకు ఆ ఇద్దరూ నివ్వెరపోయారు.

వారిరువురికి ఆ మాటల వెనుక ఓ గొప్ప సత్యం ఆవిష్కరింపబడినట్లయింది.

ఈ ప్రపంచంలో మానవధర్మం నిండిన ప్రతి మనిషి భగవత్ స్వరూపమే అనే సత్యం వారిరువురికీ బైరాగి మాటల్లో స్ఫురించింది.

భగవంతుడు ఉన్నారని ఒకరు, లేడని వేరొకరు వాదించుకోవడం ఎంతటి అజ్ఞానమో, అవివేకమో వారికి అవగతం అయింది.

ఆ క్షణమే–

బైరాగి మాటలు వారి ఆలోచనా దృక్పథాన్ని మార్చేయి. వారిలో అజ్ఞాన చీకటి చెదిరింది. జ్ఞాన జ్యోతి వెలిగింది. మరుక్షణం గది ద్వారం దాటి బయటకు వెనుదిరిగి నడిచి వెళ్లిపోతున్న బైరాగికి, ఆ భగవత్ స్వరూపుడికి నిండు మనస్సుతో చేతులెత్తి నమస్కరించారు.

★